కథా నిలయం
శ్రీకాకుళం

# ఊపిరి పోసిన తలారి

అరవై రెండు సంవత్సరాలకు పైబడిన వయసు. అరవై ఏడు కిలోల బరువున్న శరీరం. ఆరడగులకు ఓ అంగుళంపైనే అనిపించే ఎత్తు. చామన చాయ రంగు. అదుపు తప్పుతున్న అవయవాలు. ఆక్రోసిస్తున్న మనసు. సొమ్మసిల్లిపోతున్న ప్రాణం. ఏదో చెప్పాలని తాపత్రయం. ఏమీ చెప్పలేకపోతున్నానే అనే బాధ, చెప్పకుండానే పోతానేమోనన్న దిగులు!

మనసుకు మత్తురాలేదు, మైకంకమ్మలేదు. తన అసహాయస్థితి తనకు తెలుస్తూనే వుంది. ఎన్నెన్నో జ్ఞాపకాలు, తీరనికోరికలు, నెరవేరని ఆశలు, కలిసిరానికాలం, సమసిపోని కసి, వైరాగ్యం, విముఖత, ఉదాసీనత.

మూతపడే కళ్లు కాలిపోతున్న ఒళ్లు, నొప్పితో గుంజుతున్న కాళ్లు, వంకర్లు పోతున్నట్లు, తిమ్మిరెక్కిన వేళ్లు... గుర్తించలేకపోతున్న ఆనవాళ్లు, దిగజారుతున్న ఆరోగ్య పరిస్థితి విషమంగా మారుతున్న విషాదం.

వయసు తెచ్చిన మార్పులు, అలవాట్లు అదనంగా చేర్చిన మార్పులు వెరసి అనారోగ్యంపాలైన దేహం. దాంతోపాటే కృంగిపోయిన మనసు. తనను నమ్ముకున్న వాళ్లందరికీ తన శక్తిమేరకు చేయగలిగిందేదో చేశాన్లెమ్మన్న సంతృప్తి. దాన్ని వెన్నంటుతూ ఇంకా ఏదో ఏదో చేయలేకపోయాన్న అసంతృప్తి. దేనికయినా సమయం మించిపోయిందన్న భావన బాధ కలిగిస్తున్నది.

తెచ్చుకున్నది ఎంతో, చేర్చుకున్నవి ఎంతో, తీర్చుకున్నది ఎంతో, చివరకు మిగిలిందీ, మిగిలేది ఎంతో తేల్చి చెప్పేవాడు ముందుగా చెప్పడు. అతగాడు నోరువిప్పి చెప్పే సమయానికి లెక్కలు సరిచేసుకునే అవకాశం చిక్కదు. అంతటి అస్వస్థతలోనూ వదలని తాత్వికతలో తలమునకలవుతున్న మాట యదార్థం.

నాలుగు దశాబ్దాలకు పైగా 'నా' అనుకున్న మనిషి అలా నరకయాతన పడుతుంటే చూడలేక తల్లడిల్లిపోతున్నది ఆ ఇల్లాలు. తనకి ధైర్యం చెప్పే మనిషికే దయనీయమైన పరిస్థితి ఎదురయ్యింది. తనకి తనే ధైర్యం తెచ్చుకోవాలి. ఎలాగైనా తన దైవాన్ని కాపాడుకోవాలి.

అంతే... ఆ ఆలోచనతో పాటే తెగింపుకూడా వచ్చింది. అప్పటివరకూ అచేతనంతో ఉన్న ఆమెలో ధైర్యం కలిగింది. ఒక్క ఉదుటున లేచింది.

అంబులన్స్ కోసం ఫోన్ చేసింది. అలాగే మరో రెండు, మూడు నంబర్లు డయల్‌చేసి వాళ్లకి విషయం చెప్పింది. పావుగంటలో ఇంటిముందుకువచ్చింది అంబులెన్స్. అప్పటికే బీరువాలో ఉన్న డబ్బు తీసుకుని పర్సులో పెట్టుకుంది. కబురు పెట్టిన కుర్ర జంట వచ్చినందుకు కళ్లతోనే కృతజ్ఞతలు తెలియచేసింది. ఇంటికి తాళం వేసింది. వచ్చిన దంపతులు వారి వాహనంపై బైల్దేరారు. అంబులెన్స్‌లో భర్త పక్కనే కూర్చుని హాస్పిటల్‌కు ప్రయాణం అయ్యిందామె కొండంత ఆశతో.

నలభై సంవత్సరాల సాహచర్యంలో ఎన్నెన్ని అనుభవాలు? ఎన్ని బతిమిలాటలు, ఎన్ని హెచ్చరికలు, మరెన్ని పంతాలు, పట్టుదలలు, మూతిబిగింపులు, అలకలు, తిట్లు, ఓదార్పులు, పరాచకాలు, కౌగిలింతలు, విసుర్లు, కసుర్లు... ఎన్నిరకాలు! అక్కరకురాని చుట్టాలు, పైకి ప్రేమ కురిపిస్తూ. అవసరాలు తీర్చుకునే చుట్టాలు, అవసరార్థపు అనురాగాలు, ఆప్యాయతలు.

అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు, ఏమీ తెలియక పోయినా అన్నీ తెలిసినట్లు, ఎన్ని అపవాదులు, ఎన్నెన్ని ఆపనిందలు.. అలానే ఎన్ని రకాల పొగడ్తలు, మెప్పులు, మెహర్బానీలు, అబ్బోనిజం దేవుడెరుగు, నీరు పల్లమెరుగు. ఆవిడ మనసులో ఉవ్వెత్తున లేచిపడుతున్న జ్ఞాపకాల తరంగాలు, ఆలోచనలు అలా పరుగుపెడుతుండగానే హాస్పిటల్ ఆవరణలో ఆగింది అంబులెన్స్.

ఇంటి నుంచి హాస్పిటల్‌కు తరలించబడింది అనారోగ్యంపాలై నీరసించిపోయిన ఆ దేహం.

కంపు... కంపు స్పిరిట్ కంపు, టించర్ కంపు, మందుల కంపు, మనుషుల కంపు, డాక్టర్ కూర్చున్నగదికి ఉన్న స్ప్రింగ్ డోర్ ఊగుతూనే ఉంది నిర్విరామంగా. రోగుల్ని వరుస ప్రకారం లోపలికి పంపే ఓ కుర్రవాడు తలుపు దగ్గర అలాగే నిలబడి ఉన్నాడు. నర్సులు, మరో కాంపౌండరు కాబోలు తడవకోసారి గదిలోపలికి బైటకు వస్తూపోతూ ఉన్నారు. నలుగుర్తోపాటు నారాయణ, గుంపులో గోవింద, ఎవరివంతు వచ్చినప్పుడు వారిని డాక్టరుగారు చూస్తున్నారు.

డాక్టరు చూడటం అంటే ప్రత్యేకంగా పరీక్షించటం అంటూ ఏమీవుండదు. ఊరు, పేరు అడుగుతారు. బాధ ఏమిటో అడుగుతారు. ఎప్పట్నుంచో అని కూడా అడిగితే కాస్తంత శ్రద్ధగా చూసినట్లు లెక్క. ఒకటి రెండు ధైర్యవచనాలు పలికితే ఆ వచ్చిన రోగి, అతని తాలూకు బంధువులు బలమైన రికమండేషన్‌తో వచ్చిన వాళ్లని అర్థం. 'ఇంత లేటెందుకు చేశారమ్మా' అని శాంతంగా అడిగితే కొంత ఉపశమనం అన్నా మిగుల్తుంది.

'ఇప్పటివరకూ ఇంట్లో పెట్టుకుని ఇప్పుడొచ్చి నిమిషాల్లో నయమైపోవాలంటే ఎట్లా' అని విసుగ్గా, విసురుగా అంటే అసలే భయంతో వణికిపోయేవారికి మరీ భయం. రోగికి ఈ విషయాలు అర్థమయినా కాకపోయినా, వెంటవచ్చిన వాళ్లూ రోగులయ్యేటట్లుగా మాట్లాడే ప్రక్రియ. అయినా నాడి, నాలుక పరీక్షగా చూసి రోగ నిర్ధారణ చేసే రోజులు ఏనాడో పోయినై, అంత తెలివితేటలు ఎవరి కేడ్చినయ్యని కొందరు అనుకుంటుంటే, ఇంకా ఆ పాతకాలం వైద్యాన్నే పట్టుకుని వేలాడుతుంటే ఎట్లా? అని మరికొందరు అంటున్నారు.

ఏది ఏమయినా డాక్టరనబడే వాని దగ్గరకు వెళ్లగానే ముందు ఆయన మాటల్తో సగం రోగం పోవాలి. సగం ప్రాణం రావాలి. అతగాడు సరైన వైద్యుడు. కానీ జరుగుతున్నదేమిటి? అవసరానికి మించిన హంగామా? అన్నింటికీ పరీక్షలే. అదేమంటే 'మా జాగ్రత్తలో మేం వుండాలండీ... ఇప్పుడిట్లా మాట్లాడే వాళ్లే రేపు డాక్టరు నిర్లక్ష్యం మూలంగానే రోగి చనిపోయినట్లు ప్రచారంచేసి మమ్మల్ని బజారుకీడుస్తారు. అప్పుడు మమ్మల్ని మేం రక్షించుకో వాలంటే ఇవిగో... ఈ పరీక్షలే మాకు దిక్కు. వీటి ఆధారంతోనే మేం బతికి బయటపడాలి' ఇదీ వైద్యో నారాయణో హరీ అనుకోవాల్సిన వారి వాదన, వేదన.

'నిజమే. ఎవరి బాధలు వారికున్నాయ్. ఎవరో ఒకరిద్దరు చేసే తప్పుడు పన్లకు మరో పరిష్కారం కనిపెట్టాకే గానీ, ఆ కారణంగా అందర్నీ ఇలా శిక్షిస్తే ఎలా?'

"లక్షలు ఖర్చుపెట్టి సీట్లు సంపాదిస్తున్నాం. మరెన్నో లక్షలు ఖర్చుచేస్తేగాని సర్టిఫికెట్లు చేతికి రావడంలేదు. ఇన్ని కష్టాలుపడి, ఇన్ని లక్షలు ఖర్చు చేసి డాక్టర్లమయింది ప్రజాసేవ చెయ్యటానికా? ప్రజలచేత కేసులు వేయించుకుని కోర్టుల చుట్టూ తిరగడానికా?

మేమేం బతకడం చేతకాని వాజమ్మలం కాం. డబ్బు సంపాదించడం చేతగాని వాళ్లమూ కాము. అయినా పోయే ప్రాణాల్ని నిలిపే ప్రయత్నం చేయగలగం గాని ప్రాణాలు పోయడం మా పనికాదు. అంతేకాదు అన్నీ సవ్యంగా జరిగి కోలుకుని బతికిబట్టకడితే మమ్మల్ని దేవుళ్లంటారు, ఆ ఆయుష్షు తీరి చస్తే మేమే మీప్రాణాలు తీసిన హంతకులమన్నట్లు అన్యాయంగా మాట్లాడతారు. ముందు మీకు ఏది నైతిక బాధ్యత?"

ఇది డాక్టర్ల ఆక్రందన, ఆవేదన.

"అవును మరి! న్యాయవాదులనబడే వారంతా నిజంగా న్యాయంవైపునే నిలబడి, న్యాయంకోసమే వాదిస్తున్నారా? ఇంజనీర్లమని చెప్పుకునే వారంతా నాణ్యతా ప్రమాణాలకు విలువనిస్తూ బలమైన పునాదుల్ని ఏర్పాటు చేయించగలుగుతున్నారా?

ఆ అన్యాయపు కట్టడాలు, నిర్మాణాలు కుప్పకూలి చనిపోతున్న వారిని ఎవరు చంపినట్లు?

కోర్టుల్లో అన్యాయం గెలిచి, ఆ బాధతట్టుకోలేక అశువులు బాసే అమాయకుల్ని ఎవరు చంపినట్లు? ఆ పట్టభద్రులకంటే మేమే నయంకదూ. కాస్తోకూస్తో బతికించాలని ప్రయత్నంచేసి, ఆఖరు నిమిషంలో గత్యంతరంలేని పరిస్థితుల్లో విధికి మిమ్మల్ని వదిలేస్తున్నాం"

మీ వాదనలు మీకున్నయ్. నా బాధలగురించి పట్టించుకోండి ముందు మందుల సంగతి తర్వాత, ముందర ఈ ఇనుపబల్లపై నుంచి నన్ను పరుపున్న మంచంమీదకు మార్చండి. అసలే ఒళ్లంతా కుళ్లబొడిచినట్లుంది. వీలైనంత తొందరగా పరుపుపైకి మార్చండి. కొంత ఉపశమనంగా వుంటుంది.

అయినా రోజుకి ఆరువందలు తీసుకుంటారటగా ఈ మంచంపైన పడుకోపెట్టినందుకు! ఆ మనసులోని రోదన, ఎవరికీ వినపడని రోదన!

ఎవరో వచ్చి వరసగా రెండు ఇంజక్షన్లు పొడిచారు. 'అబ్బా... పొడవండి. పొడవండి....మీ ఇష్టం... ఈ శరీరం మీకు అప్పజెప్పాను. ఇక చేసేదేముంది? చేసినపాపం అనుభవించక తప్పదు. తూట్లు పొడవండి. అందుకు నేను బాధపడను. కానీ... ఓ డాక్టర్లూ ఒక్క మాట.

చాలీచాలని ఆదాయాల్తో బతుకుబండ్లను ఈడ్చే బక్క ప్రాణాల్ని నక్కల్లా పీక్కుతినే ప్రయత్నం మాత్రం చేయకండి. అన్నట్లు అదేదో పట్టణంలో మీ డాక్టర్లందరూ హాస్పిటల్స్ కట్టించిన రోడ్డు పేరు నక్కలు రోడ్డుట! సరిగ్గా

సరిపోయిందనిపించింది నాకు. అసలు ప్రతిచోటా మీరుండే వీధికి అదే పేరు పెట్టాలని నా కోరిక.

ఒళ్లు వేడిగా వుందని మీ దగ్గరికి వచ్చిన వాడి మెడలు వంచి అడ్డమయిన పరీక్షలు చేయించుకు రమ్మని, మీ హాస్పిటల్లో ఆరు రోజులు వుంచుకుని ఏ అనారోగ్యం లేదు పొమ్మంటూ అరవైవేలు వదిలించిన మీరు ఏ రకంగా డాక్టర్లు! ఏ రకండాక్టర్లు.... ఒక్కసారి ఆలోచించుకోండి.

మూడు వందల మార్కుల వాళ్లకీ సీట్లివ్వాలి. మూడు మార్కులు వచ్చినవాళ్లకీ సీట్లివ్వాలి. ప్రతిభతో నిమిత్తం లేకుండా పట్టాలు చేతికివ్వాలి. వారందరూ డాక్టర్లుగా అవతారాలెత్తి మనుషుల ప్రాణాల్తో ఇష్టానుసారం చెలగాటం ఆడుకోవాలి.

ప్రభుత్వ ఆసుపత్రులన్నీ ధర్మసత్రాలుగా మారిపోయాయి రోగులక్కాదు, డాక్టర్లకు అక్కడ ఎవ్వరిమీద ఎవ్వరికీ అదుపూ, అజమాయిషీ వుండదు. ఎవరికివాళ్లు అధికార్లు. మధ్యమధ్యలో ఉన్నతాధికారులో, మంత్రివర్యులో వచ్చి ఆకస్మిక తనిఖీ పేరున ఆగ్రహం వెలిబుచ్చి వెళ్లటం, ఆ విషయం మర్నాడు పేపర్లో పెద్దక్షరాలతో ముద్రింపబడటం ఓ తంతుగా మారింది.

'అవును గానీ... నేనేంటి వాళ్ల వాకిట్లోకి, వాళ్ల అధీనంలోకి వచ్చి వాళ్ల గురించి ఇంత వ్యతిరేకంగా ఆలోచిస్తున్నాను. నా ఆలోచననుగనుక వాళ్లు పసిగట్టారో... నా గతి ఇంతే సంగతులు. అమ్మో... లైడిటెక్టర్‌లాగానే మన ఆలోచన్లు కనిపెట్టే మిషను ఎవరన్నా కనిపెడితే.... ఈ డాక్టర్లు మనల్ని బతకనిస్తారా? ఇంతకీ నన్నేంచేస్తారో! ఎన్ని పరీక్షలు చేయించాలంటారో! పాపం ఆ వెర్రిబాగుల ఇల్లాలు నా కోసం ఎన్ని తిప్పలుపడాలో! వీళ్లకి ఎలా ఈ విషయాలన్నీ వినబడటం?' ఆ మూగ వేదన అలా కొనసాగుతున్నది.

కొన్ని రకాల ఆపరేషన్లకు రోగులకు ఇచ్చే మత్తు మూలంగా ఆ రోగికి కత్తెర్ల శబ్దాలు, లీలగా డాక్టర్ల మాటలు, ఇతరత్రా ధ్వనులు వినబడుతుంటయ్యిగానీ, ఆపరేషన్ చేసేటప్పుడు శరీరానికి ఏమాత్రం స్పర్శ తెలీదు, నొప్పి తెలీదు చూశారూ... సరిగ్గా అలాంటి పరిస్థితిలో ఉన్నదాయన పరిస్థితి.

తన ఆరోగ్య స్థితి గురించి, ఆర్థిక స్థితిగతుల గురించి ఇంకా ఇంకా...ఎన్నో... ఎన్నో విషయాలు మాట్లాడుకుంటున్న ఆ ఇద్దరి డాక్టర్ల మాటలు ఆయనలో ఆగ్రహాన్ని కలిగించినై. అయితే ఏం లాభం? ఆగ్రహాన్ని వెలిబుచ్చే పరిస్థితిలో లేడే. మనసుపడే వేదన ఏ విధంగా బయటపెట్టడం?

"ఒరే తండ్రుల్లారా మిమ్మల్ని ప్రాణదాత అని కూడా అంటారే! కనికరం చూపండి. కసాయిల మాదిరి ప్రవర్తించకండి. డబ్బు సంపాదించవద్దని చెప్పటంలేదు. దగా చేయకండి అవసరంలేని ఆపరేషన్లు చేయకండి, అక్కర్లేని పరీక్షలు చేయించకండి, నిర్దాక్షిణ్యంగా మాట్లాడకండి, అధైర్యపరచి మీ అక్కర తీర్చుకోకండి. దయచేసి నా మాటలు ఆలకించండి..."

'అయ్యయ్యో... అవసరంలేని ఆపరేషనా! కొద్ది నిమిషాల్లో ఈ శరీరం కోతకు గురికాబడబోతుంది అన్యాయంగా, అక్రమంగా. ఎలా అడ్డుకోవటం? ఎలా అనటం? ఇంకొద్దిసేపట్లో నాకు ఈ పాటి స్పృహ పోవచ్చు. ఎవరికి తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది? నేను చచ్చాననుకోండి. ఈ డాక్టర్లు బతికిపోతారు. లేదూ.. నే బతికి బట్టగడితే. ఈ వైద్యులు హరీమనడం ఖాయం. అందుకోసమైనా నే బతకాలి. బతికి తీరాలి.

ఇంకెందరో బతుకులు బుగ్గిపాలు కాకుండా వుండటానికి నేను బతకాలి. నా మత్తు వదలాలి. ఈ అన్యాయాన్ని గొంతెత్తి చాటి అనక చచ్చినా పరవాలేదు. అదీ నాకు సంతోషమే. కాని ఈ నిజాలు ఎవ్వరికీ తెలియకుండానే నే కన్నుమూస్తే. నా నోరు మూతపడితే. అయ్యో... ఎలా?'

'ఆఖరిగా ఒక్కమాట వినండయ్యా డాక్టర్లూ... ప్రాణం తీసేయడమే వృత్తిగా బతికిన తలారిక్కూడా మొన్నా మధ్య ఓ మనిషిని ఉరితీసేటప్పుడు మనసొప్పక, టెన్షన్‌కి గురై, మానవత్వం తట్టిలేపిన కారణంగా తన మనోవేదనను వెళ్లబుచ్చుకున్నాడు. కానీ.. ప్రాణాలు నిలపాల్సిన మీరు ప్రాణదాతలుగా పేరుగాంచిన మీరు ఇంత సునాయాసంగా, అమానుషంగా మనుషుల ప్రాణాలు తీస్తున్నారే!... మీ కంటే తలారే ఎన్నో రెట్లు మేలు.

ప్రాణం తీయడమంటే కేవలం చంపడమే కాదు. ఒకవేళ మా నిర్వచనం ప్రకారం రోగి ప్రాణాల్తో బయటపడినా, ఆ తర్వాత కోలుకోలేని విధంగా దిగజారిన అతడి ఆర్థిక పరిస్థితికి, అన్నం దొరకని పరిస్థితికీ సంపూర్ణంగా మీరే బాధ్యులు.

అవతల వాడికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ మౌనంగా వుండటం మానవత్వం కాదనే ఆలోచనకు ఊపిరిపోసిన తలారి నిజంగా ఆదర్శప్రాయుడయ్యా, మీరూ ఆలోచించండి. నాకూ... నాలాంటి ఎందరికో అన్యాయం..."కళ్లు మూతలు పడినై. ఆలోచన్లు ఆగిపోయినై.

డాక్టర్లు బతికిపోయారు పాపం!

◆ స్వాతి సపరివార పత్రిక - 3.6.2005 ◆